



శాప్ ఛైర్మన్‌గా రవి నాయుడు

● వివిధ కార్పొరేషన్ల మెంబర్లుగా పరసా, ఊకా సహా ఐదుగురు

● తిరుపతి జిల్లాలో ఆరుగురికి తొలి విడత నామినేటెడ్ పదవులు

తిరుపతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తొలివిడతగా మంగళవారం ప్రకటించిన నామినేటెడ్ పదవుల జాబితాలో తిరుపతి జిల్లా నుంచీ ఆరుగురు టీడీపీ నేతలకు చోటు దక్కింది. తిరుపతికి చెందిన తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిమిని రవినాయుడు శాప్ (ఏపీ స్పోర్ట్స్ అథారిటీ) ఛైర్మన్‌గా ఛాన్సు కొట్టేశారు. మిగిలిన ఐదుగురూ వివిధ కార్పొరేషన్లలో మెంబర్లుగా పదవులు దక్కించుకున్నారు. ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో తిరుపతి టీడీపీ నేత ఊకా విజయ్‌కుమార్, సత్యవేడు టీడీపీ నేత డాక్టర్ పి.చందన స్రవంతి మెంబరు పదవులను పొందారు. సూళ్ళూరుపేట నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత, మాజీ మంత్రి పరసా రత్నం మార్క్‌ఫెడ్ మెంబరు పదవి పొందగా నగరి నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత గంజి మాధవయ్య, వెంకటగిరి నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత గంగాధర శ్రీరామదాసు ఏపీ పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ మెంబర్లుగా పదవులు దక్కించుకున్నారు.



ఊకా విజయకుమార్, పరసారత్నం, చందన స్రవంతి, గంగాధర శ్రీరామదాసు, గంజి మాధవయ్య

యువ నాయకుడి కష్టానికి గుర్తింపు

తిరుపతికి చెందిన రవినాయుడికి శాప్ ఛైర్మన్ దక్కడంతో యువ నాయకుడి కష్టాన్ని అధిష్ఠానం గుర్తించినట్టయింది. సామాన్య కార్యకర్తగా పార్టీతో ప్రయాణం మొదలుపెట్టి అంచెలంచెలుగా రాష్ట్రస్థాయికి ఎదగడంతోపాటు పార్టీ భావినేత నారా లోకేశ్ వెంట నిలవడం ఇతడికి ప్రత్యేక గుర్తింపునిచ్చింది. 2005లో ఓరియంటల్ కాలేజీ స్టూడెంట్స్ యూనియన్ ఛైర్మన్‌గా విద్యార్థి రాజకీయాల్లో అడుగుపెట్టిన రవినాయుడు తర్వాత టీఎన్ఎస్ఎఫ్‌లో చేరి చంద్రగిరి నియోజకవర్గ అధ్యక్షుడిగా, ఎస్వీయూ ప్రధాన కార్యదర్శిగా, రెండుసార్లు అధ్యక్షుడిగా, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా, జాతీయ కమిటీ సమన్వయకర్తగా పనిచేశారు. 2020లో తిరుపతి తెలుగుయువత పార్లమెంటు అధ్యక్షుడిగా నియమితులైన ఆయన 2021లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగానూ, రాష్ట్ర కార్యక్రమాల సమన్వయకర్తగానూ నియమితులయ్యారు. యువనేత నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర మొదటి దశలో వలంటీర్ల కో ఆర్డినేటర్‌గానూ, రెండవ దశలో యాత్ర కో ఆర్డినేటర్‌గానూ పనిచేయడం రవినాయుడిని లోకేశ్ టీమ్ మెంబరును చేసింది. అధినేత చంద్రబాబు అక్రమ కేసులో అరెస్టయిన సందర్భంగా ఆయన సతీమణి నారా భువనేశ్వరి నిజం గెలవాలి పేరిట చేపట్టిన యాత్రకు కూడా రవినాయుడు కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమాలతో అధినేత కుటుంబానికి చేరువయ్యారు. గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వంలో హత్యాయత్నం, ఎస్సీ అట్రాసిటీ తదితర కేసులతో సహా మొత్తం 57 కేసులు నమోదైనా, ఆ కేసుల్లో అర్ధరాత్రిళ్ళు అరెస్టయినా, ఎన్నోసార్లు గృహ నిర్బంధాలకు లోనైనా వెరవకుండా పార్టీ కోసం కష్టపడి పనిచేయడాన్ని పార్టీ అధిష్ఠానం గుర్తించింది. ఈ నేపథ్యంలో శాప్ ఛైర్మన్ వంటి రాష్ట్రస్థాయి పదవి దక్కడం పార్టీ శ్రేణులకు కూడా సానుకూల సంకేతాన్ని, సందేశాన్ని ఇచ్చినట్టయింది.

తొలి విడతలో టీడీపీ నేతలకే ఛాన్సు

తొలి విడత నామినేటెడ్ పదవుల్లో తిరుపతి జిల్లా నుంచీ కేవలం టీడీపీ నేతలకే అవకాశం దక్కింది. జిల్లాలో ఆరు నియోజకవర్గాలుండగా మొదటి దఫా చేపట్టిన పదవుల భర్తీలో తిరుపతి, వెంకటగిరి, సూళ్ళూరుపేట, సత్యవేడు నియోజకవర్గాలతో పాటు నగరి పాక్షిక నియోజకవర్గ నేతలకు అధిష్ఠానం గుర్తింపు కల్పించింది. ఈ దఫా శ్రీకాళహస్తి, గూడూరు, చంద్రగిరి నియోజకవర్గాల నేతలెవరికీ అవకాశం రాలేదు. కాగా ప్రభుత్వం ప్రకటించిన తాజా పదవుల జాబితాలో జిల్లా నుంచీ టీడీపీ మినహా కూటమిలోని ఇతర మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నేతలకు అవకాశం రాలేదు. తొలి జాబితాలో ప్రకటించింది కేవలం 20 కార్పొరేషన్లు మాత్రమే కావడం, ఇంకా భర్తీ చేయాల్సిన పదవులు బోలెడు వుండడంతో మలి విడతలో ఆ పార్టీల నేతలకు అవకాశం దక్కుతుందని భావిస్తున్నారు.

చిత్తూరు జిల్లాకు ఏదీ సముచిత స్థానం..?

● ఒక్కరికీ దక్కని కార్పొరేషన్ ఛైర్మన్ పదవి

చిత్తూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాకు నామినేటెడ్ పదవుల్లోనూ తొలివిడతలో సముచిత స్థానం దక్కలేదు.20 కార్పొరేషన్లకు ఛైర్మన్ పదవుల్ని భర్తీ చేయగా.. జిల్లాకు ఒక్కటీ కేటాయించలేదు.ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నం,టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చిత్తూరు మాజీ మేయర్ కటారి హేమలతకు మాత్రమే అవకాశం దక్కింది.నగరి నియోజకవర్గంలోని పుత్తూరు మాజీ ఎంపీపీ గంజి మాధవయ్యకు పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవకాశం లభించింది. ఈయన ఎమ్మెల్యే భానుప్రకాష్ ప్రకాష్ వెన్నంటే ఉంటూ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కష్టపడ్డారు. దీంతో పార్టీ గుర్తించి పదవి ఇచ్చింది.



● పీఎస్ మునిరత్నానికి గౌరవం

కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నం ఆవిర్భావం నుంచీ పార్టీలో ఉన్నారు. చంద్రబాబుతో కలిసి ఎస్వీయూలో చదువుకోవడంతో పాటు ఆయన కుప్పంలో పోటీ చేస్తున్నప్పటి నుంచి వెంటే నడుస్తున్నారు. గతంలో రెస్కో ఛైర్మన్‌గా పనిచేశారు. ఆయన సీనియారిటీని గుర్తించి ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా అవకాశం కల్పించారు.అయితే కుప్పంలో సీనియర్ నాయకుల్ని గౌరవించడంతో పాటు కొత్తవారికి కూడా అవకాశం కల్పించాలని అక్కడి టీడీపీ శ్రేణులు కోరుతున్నాయి. కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ ఓటమి చెందినప్పుడు.. సమీక్ష నిర్వహించిన చంద్రబాబు ఇక కొత్తవారిని ప్రోత్సహిస్తానని హామీనిచ్చారు. దీంతో నామినేటెడ్ పదవులపై కొత్తతరం నాయకులు ఆశలు పెట్టుకున్నారు. వచ్చే జాబితాలో అయినా తమ పేర్లుంటాయని ఆశిస్తున్నారు.

● డైరెక్టర్ పోస్టుకు హేమలత పరిమితం



చిత్తూరు మాజీ మేయర్ కటారి హేమలత అత్తామామలు కటారి అనురాధ, మోహన్ 2016లో హత్యకు గురయ్యారు. అత్త మేయర్ పోస్టులో ఆమె పనిచేశారు. తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. భర్త ప్రవీణ్ కరోనా సమయంలో మరణించి ఈమెను ఒంటరిగా మార్చారు. గత ఐదేళ్లలో వైసీపీ వేధింపుల్ని దీటుగా ఎదుర్కొని టీడీపీ కోసం శ్రమించారు. శ్రేణుల్ని కాపాడుకున్నారు. ఎమ్మెల్యే టికెట్ ఆశావహుల్లో ఈమె కూడా ఒకరిగా నిలిచారు.ఈమెకు ఏదైనా పెద్ద పదవే లభిస్తుందని అనుకుంటుండగా టూరిజం డైరెక్టర్ పోస్టుకు పరిమితం చేశారు.

ఆఫీసా.... గోడామా..?

● కలెక్టర్ ఆగ్రహం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 24: 'ఇదేమైనా ఆఫీసా లేక గోడామా... శుభ్రత పాటించాల్సిన అవసరం లేదా..? ఇదేనా మీ ఆఫీసు నిర్వహణ తీరు. ఎక్కడికక్కడ సరంజామా ఉంచుకోవడం చేతకాదా?' అంటూ జిల్లా అధికారులపై కలెక్టర్ సుమిత్‌కుమార్ అక్షింతలు వేశారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వివేకానంద భవన్‌లో వివిధ సెక్షన్లను, ప్రభుత్వ కార్యాలయాలను కలెక్టర్ తనిఖీ చేశారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి, ఎన్ఐసీ, పౌరసరఫరాల సంస్థ డీఎం కార్యాలయం, డీఎస్వో, ఇనాం (రెవిన్యూ) తదితర కార్యాలయాలను కలెక్టర్ పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పౌరసరఫరాల సంస్థ డీఎం కార్యాలయంలో ఫైళ్ళను తెలుపురంగు గోతాల్లో ఇష్టారాజ్యంగా వేసివుంచడాన్ని కలెక్టర్ గమనించి డీఎం మోహన్‌బాబుకు క్లాస్ పీకారు. కార్యాలయం అపరిశుభ్రంగా ఉండడంపై మందలించారు. డీఎస్వో కార్యాలయంలో తాగునీటి క్యాన్లు టేబుళ్ళపై ఉండడంతో పాటు మరమ్మతులకు నోచుకోకుండా కింద వుంచిన తూనికల యంత్రాన్ని పరిశీలించారు. గుట్టలుగుట్టలుగా ఫైళ్ళను ఉంచిన తీరును చూశారు. ఫైళ్ళను ఉంచాల్సిన క్యాబిన్‌లో అనవసరపు వస్తువులను వుంచడాన్ని పరిశీలించి డీఎస్వో శంకరన్‌పై అసంతృప్తి వ్యక్తంచేశారు. కార్యాలయాల్లోని బీరువాలను పరిశీలించి, పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యాలయాల సిబ్బంది తమకు కేటాయించిన ఫైళ్ళను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.కార్యాలయాల్లో పనికి రాని వస్తువులను తొలగించాలని ఆదేశించారు.



సివిల్ సప్లయ్ కార్పొరేషన్ ఆఫీసును తనిఖీ చేస్తున్న కలెక్టర్

సిట్ సభ్యులుగా ఇద్దరు పూర్వ ఎస్పీలు



హర్షవర్ధన్ రాజు



గోపీనాథ జెట్టి


● ఏఎస్పీ వెంకట్రావు, సీఐ రామ్‌కిషోర్ కూడా ● నెయ్యి కల్తీపై విచారణకు ప్రభుత్వ నియామకం

తిరుపతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారన్న ఆరోపణపై విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించింది. అందులో ఇదివరకూ జిల్లాలో పనిచేసిన ఇద్దరు ఎస్పీలు వుండడం విశేషం. సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్)కు గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అధిపతిగా వ్యవహరించనుండగా విశాఖ రేంజి డీఐజీ గోపీనాథ జెట్టి, కడప ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సభ్యులుగా వ్యవహరించనున్నారు.తిరుపతి అడ్మిన్ ఏఎస్పీ వెంకట్రావు, అలిపిరి సీఐ రామ్‌కిషోర్, మరికొందరు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు కూడా సిట్‌లో సభ్యులుగా నియమితులు కానున్నారు. కీలక అధికారులైన గోపీనాథజెట్టి, హర్షవర్ధనరాజు గతంలో తిరుపతి జిల్లాలో పనిచేశారు. వీరిలో గోపీనాథజెట్టి గత టీడీపీ ప్రభుత్వంలో రెండున్నరేళ్ళ పాటు తిరుపతి అర్బన్ ఎస్పీగానూ, తర్వాత టీటీడీ సీవీఎస్వోగానూ పనిచేశారు. ఇక హర్షవర్ధన్‌రాజు ఈ ఏడాదిలోనే స్వల్ప కాలం పాటు జిల్లా ఎస్పీగా పనిచేశారు. గోపీనాథజెట్టి మునుపు తిరుపతి అర్బన్ ఎస్పీగాగానూ, టీటీడీ సీవీఎస్వోగానూ పనిచేసి వున్నందున టీటీడీ సెక్యూరిటీ సహా పాలనా వ్యవహారాలపై లోతైన అవగాహన వుంది. అందుకే ప్రత్యేకంగా ఆయనను ఏరికోరి ప్రభుత్వం సిట్‌లో నియమించింది. ఇక హర్షవర్ధన్‌రాజు నిజాయితీపరుడిగానూ, ముక్కుసూటిగానూ పనిచేస్తారన్న పేరుంది. అందుకే ఆయన తిరుపతి ఎస్పీగా నియమితులైన స్వల్ప కాలానికే ప్రభుత్వం కడప జిల్లా ఎస్పీగా బదిలీ చేసింది. ఒత్తిళ్లకు లొంగరన్న పేరున్న కారణంగా ఆయనను సిట్‌లో నియమించినట్టు సమాచారం. వీరు సభ్యులుగా వున్న సిట్ శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వినియోగించారన్న ఆరోపణలపై దర్యాప్తు జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది.

విషాదం

శనగ్గింజ గొంతులో ఇరుక్కుని మూడు నెలల చిన్నారి మృతి

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 24:గొంతులో వేరుశనగ గింజ ఇరుక్కుని మూడు నెలల చిన్నారి మృతి చెందిన దురదృష్టకర ఘటన మంగళవారం తిరుపతి రూరల్ మండలం వినాయకనగర్‌లో చోటు చేసుకుంది. సీఐ చిన్న గోవిందు కథనం మేరకు...వినాయకనగర్‌లో కాపురమున్న మేస్త్రీ రాజేష్,జయంతి దంపతులకు మూడు నెలల కుమార్తె వుంది.రెండ్రోజుల క్రితం జయంతి వరండాలో మంచంపై నిద్రిస్తుండగా పక్కింట్లో వుంటోన్న జయంతి అన్న కుమారుడు శాంతన్ ఆడుకుంటూ వచ్చి తాను తింటున్న వేరుశనగ గింజను పాప నోట్లో వేసి తినమని చెప్పాడు. ఆ గింజ గొంతులో అడ్డుపడడంతో పాపకు ఊపిరాడక గిలగిలా కొట్టుకుంది.గమనించి వెంటనే రుయాస్పత్రికి తీసుకెళ్ళారు. అక్కడ పాప పరిస్థితి మెరుగుపడకపోవడంతో చెన్నై ఎగ్మోర్ ఆస్పత్రికి తీసుకెళ్ళారు.అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం పాప మృతి చెందింది.



చంద్రప్రభ వాహనంలో వినాయకుడి విహారం

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 24: కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో మంగళవారం రాత్రి చంద్రప్రభ వాహనంపై విహరిస్తూ వినాయకస్వామి భక్తులకు దర్శనమిచ్చారు.ఉభయదారులైన కాణిపాకం, చినకాంపల్లె, వడ్రాంపల్లె, కొత్తపల్లె, చిగరపల్లె, తిరువణంపల్లె, బొమ్మసముద్రం, అగరంపల్లె, పుణ్యసముద్రం, ఎగువ,దిగువమారేడుపల్లెలు, సంతపల్లె, ఉత్తర బ్రాహ్మణపల్లె, కారకాంపల్లెలకు చెందిన హరిజనులు ఉదయం కలశ ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద నుంచి పాల కలశాలను భక్తి శ్రద్ధలతో తీసుకొని కాణిపాకంలో ఊరేగించారు. అనంతరం ఆలయ కల్యాణ వేదిక వద్ద సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధునికి విశేషంగా అభిషేకం నిర్వహించారు.చంద్రప్రభ వాహనాన్ని పురస్కరించుకొని దేవాదాయ శాఖ విశ్రాంత ఏడీసీ జి.కేశవులు కుటుంబ సభ్యులతో కలసి వరసిద్ధుడికి పట్టు వస్త్రాలను సమర్పించారు.రాత్రి స్వామికి ఉభయ వరస రావడంతో కల్యాణ వేదిక వద్ద ఉత్సవర్లకు పూజలు నిర్వహించారు. అనంతరం చంద్రప్రభ వాహనంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు.ఈవో గురుప్రసాద్, ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, ఎస్వీ.కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెకర్లు విశ్వేష్, రవి పాల్గొన్నారు.

కాణిపాకంలో నేడు

ప్రత్యేక ఉత్సవాల్లో బుధవారం కల్పవృక్ష వాహన సేవను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఆలయ ఈవో, అర్చక,పండితులు,ఆలయ సిబ్బంది ఉభయదారులుగా వ్యవహరించనున్నారు.

సేవ్ తిరుమల సేవ్ టీటీడీ



టీటీడీ కార్యాలయంలోకి వెళ్లేందుకు పోలీసులతో స్వామీజీల వాగ్వాదం

● కల్తీ నెయ్యిపై హిందూ సంఘాల నిరసన

తిరుపతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : 'సేవ్ తిరుమల- సేవ్ టీటీడీ' నినాదం తిరుపతిలో హోరెత్తింది. కల్తీ నెయ్యి దోషులను కఠినంగా శిక్షించాలంటూ తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ఎదుట తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు స్వామీజీలు, హిందూ సంఘాల ప్రతినిధులు మంగళవారం ఉదయం నిరసన దీక్ష చేపట్టారు. ఛలో తిరుపతి పేరిట చేపట్టిన ఈ కార్యక్రమంలో 'తిరుమల క్షేత్రాన్ని కాపాడుకుందాం...శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని పరిరక్షించుకుందాం. కల్తీ దొంగలను వెంటనే శిక్షించాలి. జగన్మోహన్ రెడ్డి క్షమాపణలు చెప్పాలి' వంటి నినాదాలు చేశారు. దాదాపు ఇరవైమంది స్వామీజీలు, హిందూ సంఘాల ప్రతినిధులు తరువాత ఈవో శ్యామలరావును కలిశారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు. తిరుపతిలో వేలాది ఎకరాల హథిరాంజీ భూములు ఉన్నాయని అక్కడ పెద్దఎత్తున గోశాలలు ఏర్పాటుచేయాలని కోరారు. తద్వారా వచ్చే నెయ్యిని శ్రీవారికి వినియోగించాలన్నారు. ఈ అంశాలను పరిశీలిస్తామని ఈవో హామీ ఇవ్వడంతో నిరసన విరమించి వెనుదిరిగారు. ఈసందర్భంగా స్వామీజీలు మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి లడ్డూ ప్రసాదాలను అపవిత్రం చేసినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.320 రూపాయలకు కిలో నెయ్యి ఎక్కడైనా వస్తుందా? వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర రెడ్డి, ధర్మారెడ్డి ఎవరిని మోసం చేయాలని కల్తీ నెయ్యి తెప్పించారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో తిరుమలను వ్యాపారకేంద్రంగా మార్చారని ఆందోళన వ్యక్తం చేశారు. అన్నదానంలో పురుగులు పట్టిన అన్నం పెట్టారని, చంటి బిడ్డలకు పాలు కూడా ఇవ్వలేకపోయారని, టీటీడీ వెబ్‌సైట్‌లో శిలువ గుర్తులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామిని, యావత్ హిందువులను క్షమించమని కోరితే క్షమిస్తారని చెప్పారు. లేకుంటే వైసీపీ నాయకులను హిందూ సమాజం వెలివేస్తుందని, శ్రీనివాసుడి ఆగ్రహానికి గురిగాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసా నంద సరస్వతి స్వామి (శ్రీకాకుళం), భైరవానంద స్వామి (ఒంగోలు), మహదేవానంద స్వామి (కామా రెడ్డి), శివానంద స్వామి (మహబూబ్ నగర్), తిరుపతికి చెందిన గణేష్ స్వామి, ఓంకార్, కిరణ్, బండ్ల లక్ష్మీపతి, రెడ్డి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పలమనేరు
కుప్పం/పుంగనూరు

పంచాయతీలను నిర్వీర్యం చేసిన జగన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

గంగవరం, సెప్టెంబరు 24: గ్రామీణ అభివృద్ధిని గాలికి వదిలేసి గ్రామపంచాయతీల నిధులను మళ్లించి పంచాయ తీలను నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌దేనని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్య క్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని నలసాని పల్లె, కురప్పల్లె, మాదిగపల్లి, జరావారిపల్లె, కీలపట్ల గ్రామాల్లో ఆయన పర్యటించారు. ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు సోమశేఖర్‌గౌడు, ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ చంద్రశేఖర్, ప్రసాద్‌నాయుడు, గిరి, యుగంధర్, రవి పాల్గొన్నారు.

మల్లానూరులో త్వరలోనే అన్న క్యాంటీన్

కుప్పం రూరల్, సెప్టెంబరు 24: కుప్పం మండలం మల్లానూరులో త్వరలోనే అన్న క్యాంటీన్ ప్రారంభిస్తామని టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తెలిపారు. మండలంలోని మల్లానూరులో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' గ్రామ సభ జరిగింది. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. కంటి చూపు బాధితులకు ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన అద్దాలు పంపిణీ చేశారు. ఎంపీడీవో సాయి లహరి, ఏవో అమృతవల్లి, మాజీ ఎంపీపీ సాంబశివం పాల్గొన్నారు.

పారిశుధ్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రామకుప్పం, సెప్టెంబరు 24: పారిశుధ్యంతోనే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించగలుగుతారని రామకుప్పం మాజీ ఎంపీపీ అంజినేయరెడ్డి, టీడీపీ మండల ప్రధానకార్యదర్శి నరసింహులు, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి తెలియజేశారు. మంగళవారం రామకుప్పంలో సంపూర్ణ పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌పీఓ రాధాకృష్ణ, ఎంపీడీఓ ఈశ్వరన్న, ఈఓపీఆర్‌డీ బాబు, సర్పంచు మురళి పాల్గొన్నారు.

ఆటల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరచాలి

రామకుప్పం, సెప్టెంబరు 24: విద్యార్థులు చదువుతోపాటు ఆటలపోటీల్లో కూడా ప్రతిభను చాటాలని టీడీపీ రామకుప్పం మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, తెలుగు యువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్‌లు కోరారు. మంగళవారం వారు రామకుప్పం శివార్లలోని గురుకుల విద్యాలయ మైదానంలో అండర్-14, అండర్-17 మండల స్థాయి క్రీడా పోటీలు, ఎంపికలను ప్రారంభించారు. ఎంఈఓ నారాయణప్ప పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలి

గుడుపల్లె, సెప్టెంబరు 24: పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపు ఎంతో అవసరమని ఇన్‌చార్జి వీసీ ఆచార్య దొరస్వామి పేర్కొన్నారు. మంగళవారం ఎన్‌సీసీ దినోత్సవం పురస్కరించుకొని ద్రావిడ విశ్వవిద్యాలయ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్, డీన్ ఆచార్య శ్యామల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగవరం: ఆరోగ్యకర జీవనం సాగించాలంటే మొక్కలు పెంపకం తప్పనిసరి అని విశ్రాంత హోమియోపతి వైద్యులు మోహనక్రిష్ణ సూచించారు. మదర్‌థెరీసా కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్‌రావు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ దేవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

వి.కోట, సెప్టెంబరు 24: వి.కోట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో పంచాయతీ కార్మికులు ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. ఈవో శివశంకర్ నేతృత్వంలో ఈ పనులు చేపట్టారు. డెంగ్యూ జ్వరంతో చనిపోయిన చిన్నారి నివాస ప్రాంతమైన మసీదు వీధి, బాపూజీ వీధి, గంగమ్మ గుడి వీధి ప్రాంతాలో కాల్వలను శుభ్రపరిచారు. చెత్తదిబ్బలను తొలగించారు. రాత్రి వేళ పట్టణంలో ఫాగింగ్ చేశారు. ఓగు పీహెచ్‌సీ వైద్యధికారులు జ్వరాల పై సర్వే చేపట్టారు. ప్రస్తుతానికి జ్వరాలు పూర్తిగా అదుపులోనే ఉన్నట్లు డా. రాజేష్‌నాయక్ కలెక్టర్‌కు నివేదిక పంపారు.

రైతులకు విత్తన ఉలవల పంపిణీ

రాబకుప్పం, సెప్టెంబరు 24: రామకుప్పం మండలం పీఎంకేతాండాలో మంగళవారం రైతులకు టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, తెలుగుయువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్‌లు విత్తన ఉలవలను పంపిణీ చేశారు. ఏవో అమృత పాల్గొన్నారు.

కేఈసీలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం



కుప్పం, సెప్టెంబరు 24: కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీసీఎన్ విద్యాసంస్థల అధినేత బీసీ.నాగరాజ్ మొక్కలు నాటారు. పిన్సిపాల్ సుధాకర్ బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మాధవన్, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, పీఆర్వో ప్రవీణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ గంగాధరన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాబునగర్‌కు బస్సు ప్రారంభం



కుప్పం రూరల్, సెప్టెంబరు 24: కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ, అడవి ములకలపల్లె మీదుగా బాబునగర్ వరకు మంగళవారం కొత్త ఆర్టీసీ బస్సు సర్వీసును కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం ప్రారంభించారు. ఆర్టీసీ డిపో మేనేజరు పెంచులయ్య, మాజీ ఎంపీపీలు సాంబశివం, డాక్టర్ వెంకటేశ్, కుప్పం రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్, టీడీపీ నాయకులు చెక్కునత్తం మణి, సంతోశ్, ఒబ్లెప్ప, మంజు, మునిరత్నం, తిమ్మప్ప, దేవేంద్ర, కనకరాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ చైర్మన్, వైస్ చైర్మన్ల నియామకంపై హర్షం

కుప్పం, సెప్టెంబరు 24: ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ చైర్మన్‌గా ఈడిగ సామాజిక వర్గానికి చెందిన నేత, మాజీ పార్లమెంటు సభ్యులు కొనకళ్ల సత్యనారాయణ నియామకంపై కుప్పం మండల ఈడిగ, గౌడ్ సేవా సంఘం కార్యదర్శి, కుప్పం ఆర్టీసీ డిపో ఎన్ఎంయూ సెక్రటరీ ఈడిగ జయపాల్ గౌడ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ● ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా కుప్పం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం నియామకంపై టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పి. గోపీనాథ్ హర్షం వ్యక్తం చేశారు.

అలరించిన ద్రౌపదీ కల్యాణం

సోమల, సెప్టెంబరు 24: కందూరులో మహాభారత యజ్ఞ కార్యక్రమంలో మంగళవారం భాగవతారిణి గీతాశ్రీ ద్రౌపదీ కల్యాణ ఘట్టాన్ని శ్రోతలకు వివరించారు. రాత్రి పీలేరు వెంకటేశ్వర నాటక మండలి సభ్యులు ద్రౌపదీ కల్యాణ నాటకాన్ని ప్రదర్శించారు. ఉభయదారుడు వెంకటేశ్, ధర్మకర్త శ్రీనివాసులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే అమర్ నివాళి

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 24 : టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడుకు చిన్నాన్న బైరెడ్డిపల్లెకు చెందిన శ్రీనివాసులు గౌడు సోమవారం రాత్రి మృతిచెందారు. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి నివాళులర్పించారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



గుడుపల్లె: ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఎన్‌సీసీలో శిక్షణ పొందిన 35 మంది విద్యార్థులకు ఇన్‌చార్జి వీసీ ఆచార్య దొరస్వామి, రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్‌లు పరిపాలన భవనంలో మంగళవారం సర్టిఫికెట్లు అంద జేశారు. 35 బెటాలియన్ ఆఫీసర్, కేర్ టేకర్ శ్రీప్రియ పాల్గొన్నారు.

హిందువులంతా ఏకం కావాలి

పుంగనూరులో హిందూ సంఘాల శాంతి ర్యాలీ



పుంగనూరు, సెప్టెంబరు 24: శ్రీవారి లడ్డూ ప్రసాదాలను కల్తీ చేసి అపవిత్రానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, హైందవ ధర్మాన్ని కాపాడేందుకు హిందువులంతా ఏకం కావాలని పుంగనూరు హిందూ సనాతన సంఘ పరివార సంస్థల ప్రతినిధులు మంగళవారం పిలుపునిచ్చారు. కల్తీ నెయ్యికి నిరసనగా గోవింద నామస్మరణలతో పట్టణంలో ర్యాలీ చేశారు. స్థానిక కోనేరు వద్ద వెలసిన కళ్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి స్వామివారి ఫొటోతో గోవిందనామాలు జపిస్తూ అంబేడ్కర్ సర్కిల్ వరకు శాంతి ర్యాలీ చేశారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో మానవహారం చేపట్టారు. అనంతరం నిందితులను అరెస్టు చేయాలని సీఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా హిందూ సంఘ నాయకులు త్రిమూర్తిరెడ్డి, బీజేపీ నేత నరసింహులు మాట్లాడుతూ ఏ ప్రభుత్వమైనా ఆలయాల్లో రాజకీయాలకు చోటు ఇవ్వరాదన్నారు. హైందవ ధర్మానికి సేవ చేసినవారికే టీటీడీ బోర్డుప్రతినిధులుగా అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ ర్యాలీలో ఏఎస్ఐ జి.మహేంద్ర పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం, ఆదాయం



కృష్ణమూర్తి తోటను పరిశీలిస్తున్న మధ్యప్రదేశ్ వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు

కుప్పం, సెప్టెంబరు 24: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యంతోపాటు ఆదాయం కూడా సమకూరుతుందని జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు వాసు అన్నారు. కుప్పం పుర పాలక సంఘం పరిధిలోని శీగలపల్లెలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న కృష్ణమూర్తి పొలాన్ని మధ్యప్రదేశ్‌కు చెందిన ఏడుగురు శాస్త్రవేత్తలు, రైతులు మంగళవారం సందర్శించారు. ఇక్కడ ఆ రైతు అనుసరిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అధ్యయనం చేశారు. సమీకృత వ్యవసాయం, ఏటీఎం, ఏ గ్రేడ్ పద్ధతులలో కూరగాయల సాగు, వేరుశనగ యూనివర్సల్ మోడల్, ఎఎన్‌పీఎం షాప్ పద్ధతులను పరిశీలించారు. అలాగే మహిళా స్వయం సహాయక సంఘాల అభివృద్ధి, వారి ఆదాయాలు, పొదుపులు, అప్పుల గురించి తెలుసుకున్నారు. రైతు కృష్ణమూర్తి, మహిళా సంఘాల సభ్యులతోపాటు ప్రాజెక్ట్ మేనేజరు వాసు వారికి ఆయా వివరాలను తెలిపారు. సీనియర్ టీఎంఎల్‌లు హుమయూన్, డాక్టర్ పుష్ప, గురుప్రసాద్, నాంచారమ్మ, కల్పన, మండలంలోని క్యాడర్లు నాగరాజ, వెంకటేశ్, మెంటార్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లోనే గుడ్ టాక్



మాట్లాడుతున్న పీఎస్ఎం

కుప్పం, సెప్టెంబరు 24: టీడీపీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వానికి వంద రోజుల్లోనే గుడ్ టాక్ వచ్చిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా అన్నారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని 14, 15 వార్డుల్లో మంగళవారం 'ఇంది మంచి ప్రభుత్వం' కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ ఈ దీపావళికి దీపం పథకం కింద మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారని గుర్తుచేశారు. టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు సత్యేంద్ర శేఖర్, డాక్టర్ వెంకటేశ్, అన్సర్, అప్పు ముఖేశ్, కౌన్సిలర్లు, మహిళా నాయకురాలు తిరుమగళ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాల పంపిణీ

సదుం, సెప్టెంబరు 24: మండలంలోని అమ్మగారిపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో టీడీపీ, జనసేన కార్యకర్తలు 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలను మంగళవారం ఇంటింటా పంపిణీ చేశారు. టీడీపీ, జనసేన యువత గౌతం రెడ్డి, తిరుమలేశు, జయరాంరెడ్డి, రాఘవ, దొరబాబు, నాగేంద్ర, పవన్, బాలు, సుబ్రహ్మణ్యం, లోకనాథ్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: రాజుపల్లెలో ఇంటింటికీ వెళ్లి వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. ప్రత్యేకాధికారి తులసీరాం, టీడీపీ నాయకులు భానుప్రతాప్‌రెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, నాగరాజ, ప్రవీణ్‌కుమార్, రెడ్డెప్ప, చందు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సేవాభావం అలవరుచుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గంగాధరం నాయుడు

సోమల, సెప్టెంబరు 24: ప్రతి విద్యార్థి సమాజం పట్ల సేవాభావం కలిగి ఉండాలని సోమల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధరంనాయుడు తెలిపారు. మంగళవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణంలో పలు రకాల మొక్కలను నాటారు. పీవో గౌతం, అధ్యాపకులు శివయ్య, రవీంద్రారెడ్డి, నాగరత్న పాల్గొన్నారు.

కల్లూరు: పులిచెర్ల మండలం కల్లూరు వీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, కాగితపు సంచులను వినియోగించాలని పిలుపునిచ్చారు.

సదుంలో వర్షం

సదుం, సెప్టెంబరు 24: మండలంలో గత రాత్రి 12 గంటల నుంచి మంగళవారం ఉదయం 3 గంటల వరకు నిలకడగా వర్షం కురిసింది. దీంతో వారం రోజులుగా వేసవి తాపాన్ని తలపించిన వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. రోజంతా మబ్బులు కమ్ముకుని చిరు జల్లులు పడుతూనే ఉన్నాయి.

సోమల: మండల వ్యాప్తంగా మధ్యాహ్నం నుంచి జోరుగా వర్షం కురిసింది. సూరయ్యగారిపల్లె, కరకమంద, ఇరికిపెంట, తదితర ప్రాంతాల్లో 34 మి.మీల వర్ష పాతం నమోదైంది.

నాణ్యమైన భోజనం అందించాలి



చౌడేపల్లి, సెప్టెంబరు 24: విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని డీఈవో దేవరాజులు సూచించారు. మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ఎంఈవో కేశవరెడ్డి, హెచ్ఎం నాగరాజారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 24: విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పుంగనూరు ప్రభుత్వ వైద్యశాల హోమియోపతి వైద్యుడు ఎం.నాగేనాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక నక్కబండలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు సీజన్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం 234మంది విద్యార్థులకు హోమి యోపతి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం చౌడమ్మ, అక్బర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌పై అవగాహన

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 24: ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా మంగళవారం పుంగనూరు శుభారాం ప్రభుత్వ డిగ్రీకాలేజీ ప్రిన్సిపాల్ వై.రాజశేఖర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ టి.రాజశేఖర్ బహుమతులు అందజేశారు. ● అలాగే స్థానిక బీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా వలంటీర్లు స్వచ్ఛతాహిసేవ కార్యక్రమం చేపట్టారు. ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం తొలగించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ మురళి పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి ఒకరికి గాయాలు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు24: పుంగనూరు సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడటంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు... పుంగనూరు మండలం మాగాండ్లల్లె పంచాయతీ బర్నేపల్లెకి చెందిన శంకరప్ప(50) ద్విచక్రవాహనంలో పుంగనూరు నుంచి ఇంటికి వెళుతుండగా వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. శంకరప్ప కుడికాలు విరిగింది. స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ల సూచనల మేరకు తిరుపతికి తరలించారు.

110మందికి చికిత్సలు

రామకుప్పం, సెప్టెంబరు 24: రామకుప్పం మండలం గోవిందపల్లె గ్రామంలో మంగళవారం ఎన్టీయార్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 110మంది రోగులకు చికిత్సలందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు తిలక్, సిబ్బంది పార్థసారథి, ఝాన్సీరాణీ, మాజీ సర్పంచు రామ్మూర్తి, టీడీపీ ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి జయశంకర్, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు షణ్ముగం, మహేంద్రనాయుడు, రామలింగం, గోపాల్‌రెడ్డి, సుభాష్, సత్యవేలు, గోపి తదితరులు పాల్గొన్నారు.

జనరంజకపాలనే కూటమి ధ్యేయం

రామకుప్పం, సెప్టెంబరు 24: రాష్ట్రంలో జనరంజకపాలన అందించడమే టీడీపీ కూటమి పాలన ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, తెలుగుయువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్‌లు తెలిపారు. మంగళవారం మండల పరిధి ముద్దనపల్లె, పీఎంకేతాండా తదితర గ్రామాల్లో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' సభల్లో వారు మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుకు కృషిచేస్తామన్నారు. ఆయా సభల్లో ఎంపీడీవో ఈశ్వరన్, సర్పంచు సికిందర్, నాయకులు మహ్మద్‌రఫీ, గజేంద్ర, టీవీరవి, అల్లీశీన, సుబ్రీ, వెంకటరమణ, ధనపాల్‌నాయక్ పాల్గొన్నారు.

రెండేళ్లు నిద్రలేని రాత్రులు గడిపాం

● వైసీపీ పాలనలో దౌర్జన్యాలు, దోపిడీలే ● చల్లా బాబురెడ్డి



సభలో ప్రసంగిస్తున్న చల్లా బాబు రెడ్డి

కల్లూరు, సెప్టెంబర్ 24: గత వైసీపీ పాలనలో పుంగనూరు నియోజకవర్గం లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు రెండేళ్లు నిద్రలేని రాత్రులు గడిపారని, చెట్లల్లో, గుట్టల్లో కాలం గడుపుతూ చివరికి జైళ్లలో నిద్ర పోయామని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా బాబురెడ్డి తెలిపారు. పులిచెర్ల మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిల్ యాక్టును సీఎం చంద్రబాబు రద్దు చేశారన్నారు. పింఛను రూ.4వేలు చేశారన్నారు. దీపావళికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం అమలుకాబోతున్నాయని వివరించారు. అనంతరం పులిచెర్ల బీసీ కాలనీలో ఇంటింటా 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామనాథంనాయుడు, మురళీధర్, కుమార్‌రెడ్డి, వెంకటరమణ, ధనంజయ నాయుడు, మురళీధర్‌నాయుడు, నజీర్, గోపినాయుడు, రమేష్, ఈశ్వరి, ఎంపీడీవో రాజశేఖర్ బాబు, తహసీల్దార్ జయసింహ, సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎంఈఓలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య, ఏపీవో షౌకత్, ఏఓ శ్రీనివాస్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలి



రొంపిచెర్ల గ్రామ సభలో మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకులు మధుసూదన్‌రెడ్డి



రైతులకు సూచనలు అందిస్తున్న కల్లూరు ఏఓ శ్రీనివాస్

సదుం, సెప్టెంబరు 24: ప్రతి పంట సాగులోనూ రసాయనిక ఎరువల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏవో హరిప్రసాద్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని కంభంవారిపల్లె, చింతపర్తివారిపల్లె పంచాయతీల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా సబ్సిడీపై అందించనున్న డ్రిప్ పరికరాలు, వాటి వినియోగం, ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే క్షేత్రస్థాయిలో వేరుశెనగ పంట దిగుబడిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు రెడ్డిప్రసాద్ రెడ్డి, వ్యవసాయ శాఖ అనుబంధ సిబ్బంది పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్: పుంగనూరు వ్యవసాయశాఖ ఏడీఏ శివకుమార్‌రాజు మంగళం పంచాయతీలో వరినాట్లను పరిశీలించారు. వ్యవసాయాధికారి ఫయాజ్‌బాషా, రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచెర్ల: మాజీ సర్పంచ్ రవికుమార్‌నాయుడు, చిత్తూరు వ్యవసాయ సహాయసంచాలకులు మధుసూదన్‌రెడ్డి మండలంలోని బోడిపాటివారిపల్లె, కేవీఎస్ కురవపల్లె, వారణాశివారిపల్లెలో పొలంపిలుస్తోంది కార్యక్రమ గ్రామసభలు నిర్వహించారు. ఏవో సుధారాణి, పశువైద్యాధికారి శ్రీధర్, నర్మద, సురేష్‌బాబు, వెంకట్రమణనాయక్ పాల్గొన్నారు.

గుడుపల్లె: ఏవో నాగరాజు కనమనపల్లె, గుండ్లసాగరంలో పంచాయతీల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం చేపట్టారు.

పెద్దపంజాణి: మండలంలోని చలమంగళం, లింగాపురం పంచాయతీలలో 'పొలంపిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. లింగాపురం సర్పంచ్ రుద్రమూర్తినాయుడు, పుంగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమార్, పట్టుపరిశ్రమాధికారి జీవీఆర్ చౌదరి పాల్గొన్నారు.

కల్లూరు: పులిచెర్ల మండలం కమ్మపల్లి పంచాయతీలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఏఓ శ్రీనివాస్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సోమల / చౌడేపల్లె: బోయకొండ ఆలయ మాజీ సభ్యుడు పి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో పగడాలవారిపల్లె, మిట్టపల్లెల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఏవో సుధాకర్, పశువైద్యాధికారి చందనప్రియ పాల్గొన్నారు. ● చౌడేపల్లె మండలంలోని గడ్డంవారిపల్లె, పరికిదొనల్లో ఏవో జ్యోతి, ఏఎస్‌వో రామిరెడ్డి రైతులకు పలు సూచనలు చేశారు. డ్రిప్, సబ్సిడీ విత్తనాలు వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



గంగవరం, సెప్టెంబరు 24: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల, జిల్లా మెడికల్ అసోసియేషన్ వారి సహకారంతో లయన్స్ క్లబ్ ఆవరణంలో మెగా వైద్య శిబిరం నిర్వ హించారు. 510 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేప ట్టారు. 25 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపికచేశారు. 75 మందికి ఇతర వైద్య ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించి సంబంధిత ఆపరేషన్‌లకు సూచించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు జయశంకర్ కార్యదర్శి రవి, పుగలేంది, చంద్రయ్యశెట్టి, సత్యనారాయణ శెట్టి, దివాకర్, శ్రీరాములుశెట్టి, రాజప్పశెట్టి, సత్యప్రకాష్, గుణశేఖర్ నరేష్, బాబునాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబు హయాంలోనే సంక్షేమం, అభివృద్ధి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు దినేశ్

పుంగనూరు, సెప్టెంబరు24: సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తోందని పుంగనూరు టీడీపీ నాయకులు ఎం.దినేష్, సుహేల్ బాషా, ప్రసాద్, శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని మేలుపట్ల, తూర్పుమొగసాల, ఎన్ఎస్‌పేట, రాతిమసీదు, నానబాల వీధి, నక్కబండ తదితర ప్రాంతాల్లో కూటమి ప్రభుత్వం 100రోజుల్లో అమలు చేసిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని పింఛన్లు, ఇంటి నిర్మాణాలు, తాగునీరు, డ్రైనేజ్, సీసీ రోడ్డు తదితర సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామన్నారు. ● చదళ్ల గ్రామంలో టీడీపీ నాయకులు వెంకటరెడ్డి 100 రోజుల కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు.

వి.కోట: సామాన్యులకు సేవచేయడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్ అన్నారు. పెద్దబరిణేపల్లె, టీసీ.పల్లె, బోడిగుట్టపల్లె, వి.కోట, ముదరందొడ్డి పంచాయతీలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టారు. వంద రోజుల పాలనపై ముద్రించిన కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు హరినాథరెడ్డి, దామోదర్, విశ్వనాథ్, సతీస్, శ్రీనివాసులు, గౌస్‌పీర్, ఇక్బాల్, మూసా ఉన్నారు.

ఇసుక లారీ బోల్తాతో
అక్రమ రవాణా గుట్టు రట్టు

ప్రధాన సూత్రధారుడితో పాటు డ్రైవర్, క్లీనర్ అరెస్టు

పాలసముద్రం, సెప్టెంబరు 24: ఓ ఇసుక లారీ బోల్తా పడింది. పోలీసులు విచారించగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు తేలింది. దీంతో ప్రధాన సూత్రధారుడితోపాటు లారీ డ్రైవర్, క్లీనర్‌ని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగధరనెల్లూరు మండలం తూగుండ్రం నుంచి తమిళనాడుకు 16 చక్రాల లారీలో ఇసుకను లోడ్ చేసుకుని పాలసముద్రం మీదుగా చెన్నైకి తీసుకెళుతున్నారు. మంగళవారం వేకువజామున నాలుగు గంటలకు పాలసముద్రం మండలంలోని కన్యకాపురం వద్దకొచ్చేసరికి ఆ లారీ కాస్తా అదుపుతప్పి బోల్తాపడింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ భారతి, కార్వేటినగరం సీఐ హనుమంతప్ప వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. విచారించగా అసలు విషయం బయటపడింది. నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన శ్రీనివాసులురెడ్డికి చెందిన ఈ లారీ ద్వారా ఇసుకను చెన్నైలోని మునస్వామికి గంగాధర నెల్లూరు మండలం కొత్త వెంకటాపురానికి చెందిన సుధాకర్ నాయుడు అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ప్రధాన సూత్రధారుడైన సుధాకర్ నాయుడిని, లారీ డ్రైవర్ పవన్ (27), క్లీనర్ విజయ్ (21)లను అరెస్టు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, ఇసుక అక్రమ రవాణా చేసేవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



కన్యకాపురం వద్ద బోల్తాపడ్డ ఇసుక లారీ

నగరిలో ఇసుక ట్రాక్టర్లను పట్టించిన యువత

నగరి, సెప్టెంబరు 24: నగరి మున్సిపాలిటీ పరిధిలోని సత్రవాడ సమీపంలో ఉన్న తెరణి వద్ద కుశస్థలీ నదిలో రాత్రి వేళల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. స్థానికంగా ఇసుకరీచ్‌లు లేకపోవడంతో ట్రాక్టర్ యజమానులు రాత్రి వేళల్లో ఇసుకను తరలిస్తున్నారు. గతంలో సైతం పలుసార్లు తెరణికి చెందిన యువత ట్రాక్టర్ల ఫోటోలు, వీడియోలను అధికారులకు వాట్సాప్ ద్వారా పంపి వాటిని పట్టించారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కూడా ఇసుక అక్రమ రవాణాను, గంజాయి అమ్మకాలను అరికట్టాలని పోలీసులకు పదేపదే ఆదేశాలు జారీ చేస్తున్నారు. స్థానికులు ఎవరైనా ఇసుక రవాణా ఫొటోలను ఆయన సెల్‌ఫోన్‌కు వాట్సాప్‌లో పంపితే వాటిని వెంటనే పోలీసులకు పంపి ట్రాక్టర్లను పట్టుకున్న సందర్భాలున్నాయి. అయినా సరే ట్రాక్టర్ల యజమానులు గుట్టుచప్పుడు కాకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తూనే ఉన్నారు. ఇలాగే మంగళవారం ఉదయం ఐదు గంటలకు కూడా ఇసుకను ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తుండగా స్థానిక యువత ఆ ఫొటోలను తీసి పోలీసులకు పంపింది. దీంతో రంగప్రవేశం చేసిన పోలీసులు మూడు ట్రాక్టర్లను పట్టుకుని, నగరి తహసీల్దార్‌కు అప్పగించారు.



ఇసుక ట్రాక్టర్లను పోలీసులకు పట్టిస్తున్న యువత

మరిన్ని జాబ్ మేళాలు: కలెక్టర్

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 24: భవిష్యత్తులో మరిన్ని జాబ్‌మేళాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. యువతకు ఉపాధి కల్పనలో భాగంగా సీడాప్-డీఆర్‌డీఏ మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన జాబ్‌మేళాకు ముఖ్య అతిథిగా హాజరై, యువతకు పలు సూచనలిచ్చారు. 190 మంది అభ్యర్థులు హాజరవగా డైకిన్‌కు ఏడుగురు, ముత్తూట్‌కు 20, యంగ్ మైండ్స్‌కు 24, ఏజీఎస్‌కు ఎనిమిది, ఖజానాకు 15 మంది, క్రియాకు 14 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

రూ.8లక్షల బంగారు నగల స్వాధీనం



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

చిత్తూరు, సెప్టెంబరు 24: చిత్తూరు నగరంలో దొంగతనానికి పాల్పడిన తమిళనాడుకు చెందిన అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 8లక్షల విలువైన 130 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలను మంగళవారం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో సీఐలు జయరామయ్య, నెట్టికంఠయ్యతో కలిసి డీఎస్పీ సాయినాథ్‌కు తెలిపారు. కొంతకాలంగా చిత్తూరు ఒకటి, రెండో పోలీసే స్టేషన్ల పరిధిలో తాళం వేసిన ఇళ్లల్లో బంగారు నగలు చోరీలకు గురయ్యాయని కేసులు నమోదయ్యాయి. ఎస్పీ మణికంఠ ఆదేశాలతో పోలీసులు బృందాలుగా ఏర్పడి మన రాష్ట్రంతోపాటు తమిళనాడులోనూ దర్యాప్తును ప్రారంభించారు. ఈనేపథ్యంలో తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా గుడియాత్తం తాలూకా వాలత్తూరుకు చెందిన మహ్మద్ బిలాల్(32)ను కాట్పాడి వద్ద అరెస్టు చేశారు. తాళం వేసిన ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. అతడి వద్ద నుంచి 8లక్షల విలువైన 130 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దొంగను పట్టుకోవడంలో కృషిచేసిన ఎస్ఐలు, సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

మద్యం మత్తులో లారీ డ్రైవర్ బీభత్సం



తాగిన మత్తులో డివైడర్ పైకి లారీని ఎక్కించిన దృశ్యం

కల్లూరు, సెప్టెంబర్ 24: పులిచెర్ల మండలం కల్లూరు నాలుగురోడ్ల కూడలి సమీపంలో మంగళవారం రాత్రి మద్యం తాగిన మత్తులో ఓ లారీ డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. చిత్తూరు నుంచి కడప వైపు సిమెంటు బల్లలతో బయలుదేరిన లారీ కల్లూరులోని విరూపాక్షమ్మ ఆలయం సమీపంలో రహదారిపై మితిమీరిన వేగంతో వచ్చింది. ఆ క్రమంలో పలు వాహన దారులు తప్పించుకున్నారు. అదేక్రమంలో నాలుగురోడ్ల కూడలిలో డివైడర్‌పైకి ఎక్కేసింది. లారీ డివైడర్ పైకి వెళ్లడాన్ని గమనించిన జనం భయాందోళనతో పరుగులు తీశారు. లారీ రోడ్డువైపు వాలిపోయినా అలానే నడిపేందుకు డ్రైవర్ ప్రయత్నిస్తుండగా స్థానికులు అప్రమత్తమై అడ్డుకున్నారు. పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ రెహ్మాన్(45) కడప ఆజాద్ నగర్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.

ప్రేమపేరుతో బాలికను తీసుకెళ్లినందుకు దేహశుద్ధి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విజయభాస్కర్‌రెడ్డి

పుంగనూరు, సెప్టెంబరు 24: వివాహమై ఇద్దరు పిల్లలున్న ఓ వ్యక్తి ప్రేమపేరుతో బాలికను తీసుకెళ్లిన వ్యక్తిని బాలిక కుటుంబీకులు చితకబాదారు. పోలీసుల కథనం మేరకు.. పుంగనూరు మండలం బోడేవారిపల్లె పంచాయతీ అక్కింవారిపల్లెకు చెందిన కృష్ణప్ప కుమారుడు విజయభాస్కర్‌రెడ్డి (39) కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. భార్య ఐదేళ్ల క్రితం విడిపోయింది. కొంతకాలంగా మండలంలోని ఓ బాలికను ప్రేమపేరుతో నమ్మించాడు. కొద్దిరోజుల క్రితం బాలికను తీసుకెళ్లాడు. బాలిక కుటుంబీకులు గుర్తించి అతడిని మందలించి బాలికను ఇంటికి తీసుకెళ్లారు. అయితే బాలిక ఫొటోలు ఇవ్వాలని కోరగా అతడు అంగీకరించకపోవడంతో చితకబాదారు. అతడు పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలలో చేరాడు. తనపై దాడి చేసి గాయపరిచారని అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే బాలిక కుటుంబసభ్యులు సైతం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

టెంపోను ఢీకొన్న ప్రైవేటు బస్సు

టెంపో నుజ్జునుజ్జు ● ఇద్దరు డ్రైవర్లకు గాయాలు





ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు - గాయపడిన టెంపో డ్రైవర్ కృష్ణమూర్తి

పుంగనూరు, సెప్టెంబరు 24: పుంగనూరు -మదనపల్లె మార్గంలోని సుగాలిమిట్ట వద్ద మంగళవారం రాత్రి ఓ ప్రైవేటు బస్సు టెంపోను ఢీకొంది. టెంపో నుజ్జునుజ్జుకాగా బస్సు ముందుభాగం దెబ్బతింది. పోలీసుల కథనం మేరకు.. బంగారుపాళ్యం నుంచి పలమనేరు, పుంగనూరు, మదనపల్లె మీదుగా ఓ ప్రైవేటు బస్సు హైదరాబాద్‌కు వెళుతోంది. సుగాలిమిట్ట మేఘన డాబా మలుపువద్ద ఆటో ఓవర్ టేక్ చేయబోయి మదనపల్లె వైపు నుంచి వస్తున్న లగేజీ టెంపోను ఢీకొంది. టెంపో బోల్తాపడి చెల్లా చెదురైంది. పుంగనూరు మంగళం కాలనీకి చెందిన టెంపో డ్రైవర్ కృష్ణమూర్తి (34) తీవ్రంగా గాయ పడ్డాడు. బస్సు డ్రైవర్ కృష్ణయ్యకు రక్తగాయాలయ్యాయి. 108లో క్షతగాత్రులను మదనపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.బస్సులో ప్రయాణిస్తున్న కొందరికి స్వల్పగాయాలయ్యాయి. పుంగనూరు ఎస్ఐ లోకేశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో పీజీఆర్ఎస్

చిత్తూరు, సెప్టెంబరు 24: కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమానికి నియోజకవర్గ, మండలస్థాయి అధికారులు పాల్గొనాలని తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘ఇది మంచి ప్రభుత్వం’ పోర్టల్‌లో
ప్రజాస్పందన అప్‌లోడ్ చేయండి

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 24: స్వర్ణాంధ్ర-2047 విజన్ కరపత్రాలు, స్టిక్కర్ల పంపిణీ పూర్తిచేసి సచివాలయాలవారీగా ‘ఇది మంచి ప్రభుత్వం’ పోర్టల్‌లో ప్రజా స్పందనను అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, డీఎల్డీవోతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కరపత్రాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయించి ఆ ఇంటి యజమాని స్పందనలను సచివాలయాలవారీగా డిజిటల్ అసిస్టెంట్లు ‘ఇది మంచి ప్రభుత్వం’ పోర్టల్‌లో డ్యాష్‌బోర్డుకు అప్‌లోడ్ చేయించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఈనెల 27వ తేదీలోగా వర్క్‌షాప్ నిర్వహించాలని చెప్పారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో స్వర్ణాంధ్ర-2047 అంశంపై ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతి మండలానికీ ముగ్గురు విజేతలను ఎంపికచేసి బహుమతులను అందించాలన్నారు.

జిల్లాస్థాయి డాక్యుమెంట్ తయారీకి రంగం సిద్ధం

వికసిత్ భారత్‌లో భాగంగా స్వర్ణాంధ్ర-2047 భవిష్యత్తు కార్యాచరణ జిల్లాస్థాయి డాక్యుమెంట్ తయారీకి రంగం సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం జిల్లా, మండలస్థాయి అధికారులతో కమిటీలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జిల్లాస్థాయి కమిటీలో డ్వామా పీడీ, డీఆర్డీఏ పీడీ, జడ్పీ సీఈవో, డీపీవో, హార్టికల్చర్ డీడీ, సీపీవోలు సభ్యులుగా ఉంటారన్నారు. మండలస్థాయి కమిటీలో ఎంపీడీవో, తహసీల్దార్, ఎంఈవో, హౌసింగ్ ఏఈ, మెడికల్ ఆఫీసర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఉపాధి ఏపీవో, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ లేదా ఈవోపీఆర్డీ, మండల వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధకశాఖ అధికారులు ఉంటారని వివరించారు. మండలస్థాయి విజన్ ప్లాన్ ఈనెల 30వ తేదీలోగా, జిల్లాస్థాయి ప్లాన్ అక్టోబరు 15వ తేదీలోగా తయారుచేస్తామన్నారు.

దేవదాయశాఖలో ఈవోల బదిలీ

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 24: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని దేవదాయశాఖలో పలువురు ఈవోలు సోమవారం బదిలీ అయ్యారు. గిరింపేట దుర్గాంబ ఆలయ గ్రేడ్-2 ఈవో ఇ.మునిశేఖర్‌ను తిరుపతి డివిజన్ సమూహ ఆలయాలకు, అక్కడ పనిచేస్తున్న కె.మమతను దుర్గాంబ ఆలయ ఈవోగా బదిలీ చేశారు. అలాగే కుప్పం డివిజన్ ఈవో వై.చలపతిని వైఎస్ఆర్ జిల్లా పెండ్లిమర్రికొండ గంగమ్మ ఆలయానికి, బంగారుపాళ్యం మండలం మొగిలీశ్వరాలయ ఈవో ఎ.మునిరాజును అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె సమూహ ఆలయాలకు, తిరుపతి డివిజన్ సమూహ ఆలయాల ఈవో పి.లతను సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయానికి, తాడిపత్రి ఈవో వి.కృష్ణమూర్తిని తిరుపతి గాలిగోపుర మఠం ఈవోగా బదిలీ చేశారు. కర్నూలు గ్రేడ్-2 ఈవో హనుమంతరావును తవణంపల్లె అరగొండ అర్ధగిరి వీరాంజనేయస్వామి ఈవోగా, తలకోన సిద్ధేశ్వరాలయ ఈవో ఎ.జయకుమార్‌ను తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి, తిరుపతి గ్రేడ్-1 ఈవో పి.రామకృష్ణారెడ్డిని తిరుపతి కాండ్ల గోవిందాచార్యుల ట్రస్టు ఈవోగా బదిలీ చేశారు. వీరంతా వెంటనే విధుల్లో చేరాలని కర్నూలు డిప్యూటీ కమిషనరు గురుప్రసాద్ ఆదేశాలిచ్చారు. ఇదిలా ఉండగా కుప్పానికి గ్రేడ్2 ఎం.మారుతీ ప్రసాద్, బంగారుపాళ్యం మొగిలీశ్వరాలయానికి పి.రమణను, తిరుపతి డివిజన్‌కి కె.రామచంద్రారెడ్డిలను బదిలీ చేశారు. వీరందరూ మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టినట్లు జిల్లా దేవదాయశాఖ అధికారులు తెలిపారు.

వరసిద్ధుడి ఆలయంలో ప్రాయశ్చిత్త హోమం

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 24:కాణిపాక ఆలయంలో రాష్ట్రప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మంగళవారం ప్రాయశ్చిత్త హోమాన్ని నిర్వహించారు.ప్రధాన ఆలయంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, నవగ్రహ ఆరాధన, వాసుశాంతి,లక్ష్మీగణపతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం కలశాలలోని పవిత్ర జలంతో ప్రధాన ఆలయంలో సంప్రోక్షణ చేశారు.ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో గురుప్రసాద్,ఈఈ వెంకటనారాయణ, ఏఈవోలు విద్యాసాగర రెడ్డి, ఎస్పీ కృష్ణారెడ్డి,ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూదనరావు,మాజీ జడ్పీటీసీ లత,హేమాద్రినాయుడు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి తదితరులు పాల్గొన్నారు.



ప్రాయశ్చిత పూజలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళిమోహన్, ఈవో గురుప్రసాద్

కుప్పం గంగమాంబ ఆలయంలో ప్రాయశ్చిత్త హోమం



కుప్పం, సెప్టెంబరు 24: తిరుమల లడ్డూను వైసీపీ ప్రభుత్వం కల్తీ నెయ్యి వాడి అపవిత్రం చేసినందుకు ప్రతిచర్యగా కుప్పంలో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నరేశ్ ఆధ్వర్యంలో ప్రాయశ్చిత్త హోమం నిర్వహించారు.కుప్పంలోని శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయంలో ఆ పార్టీ శ్రేణులు అనర్ఘత ఘృత మిశ్రమ మోదన నివేదన హోమం జరిపాయి. పూజారులు, అర్చకులతో శాస్త్రోక్తంగా ఈ హోమ నిర్వహణ సాగింది.ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఆలయాల పవిత్రతను దెబ్బతీసే చర్యలు అనేకం చేపట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

చిత్తూరు అభివృద్ధికి ప్రత్యేక ఖాతా

- దాతల నుంచి విరాళాల సేకరణ
- ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ముందడుగు
- రూ.5,01,116 తొలి విరాళమిచ్చిన టీడీపీ నేత చంద్రప్రకాష్



కలెక్టర్‌కు చెక్ అందిస్తున్న టీడీపీ నేత చంద్రప్రకాష్. పక్కన ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

చిత్తూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగర అభివృద్ధి కోసం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఓ ముందడుగు వేశారు. దాతల నుంచి విరాళాలను సేకరించేందుకు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఖాతాను తెరిచారు. ఇప్పటికే ఉండి మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అక్కడి ఎమ్మెల్యే రఘురామరాజు ప్రత్యేక ఖాతాను తెరచి ప్రముఖుల నుంచి, పట్టణవాసుల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు. ఇప్పుడు చిత్తూరు నగర అభివృద్ధి కోసం కూడా అదే తరహాలో ఖాతాను తెరచి విరాళాలు సేకరణ ప్రారంభించారు. మాజీ జడ్పీ చైర్‌పర్సన్ గీర్వాణి భర్త, టీడీపీ సీనియర్ నేత చంద్రప్రకాష్ ఈ కార్యక్రమాన్ని మెచ్చుకుని తొలి విరాళంగా రూ.5,01,116 చెక్కును కలెక్టర్‌కు అందించారు.

బయట స్థిరపడినవారు ముందుకు రండి

బయటి దేశాల్లో, రాష్ట్రాల్లో స్థిరపడిన చిత్తూరువాసులతోపాటు స్థానికులు కూడా నగర అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే గురజాల కోరారు. ఈ నిధులతో నగరంలోని ప్రభుత్వ పురాతన భవనాలైన పాఠశాలలు, కళాశాలలు, ఇతర నిర్మాణాలు, చెరువులు, కాలువలు వంటివాటిని మరమ్మతులు చేస్తామన్నారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల తదితర టీడీపీ నాయకులు మంగళవారం నగరంలోని పురాతన భవనాలు, చెరువుల్ని పరిశీలించారు. ఈ మేరకు కట్టమంచి చెరువు అభివృద్ధి పనుల్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చిత్తూరు పార్లమెంటు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీఆర్ రాజన్, కోదండయాదవ్, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు ప్రభుత్వ ఖాజీ పదవీకాలం పొడిగింపు

పుంగనూరు, సెప్టెంబరు24:పుంగనూరు గ్రామీణ ప్రాంత ప్రభుత్వ ఖాజీగా ఉన్న హాజీ మౌలానా మౌల్వీ డి.మహ్మద్ ఎజాజ్ పదవీకాలాన్ని పదేళ్లు పొడగించారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ కార్యదర్శి కె.హర్షవర్ధన్ ఉత్తర్వులు జారీ చేశారు.

గంజాయి తోటపై పోలీసుల దాడి

కుప్పం, సెప్టెంబరు 24: కుప్పం మండలం పొన్నాంగూరు గ్రామంలో సాగు చేస్తున్న గంజాయి తోటపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. కుప్పం అర్బన్ సీఐ జీటీ.నాయుడు ఆధ్వర్యంలో సివిల్, ఎస్పీ పోలీసులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. తన పొలంలో అక్రమంగా గంజాయి పండిస్తున్న ఏకనాథన్‌ను, గింజలను సరఫరా చేసిన కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి 200 కిలోల గంజాయి ఆకులను, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

పంట నష్టం అందించండి

సోమల, సెప్టెంబరు 24: సోమల మండలంలో ఏనుగుల దాడులతో పంటలు కోల్పోయిన బాధితులను ఆదుకోవాలని మండల టీడీపీ నాయకులు మంగళవారం జిల్లా అటవీశాఖాధికారి చైతన్యకుమార్‌రెడ్డిని కలసి వినతి చేశారు. ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతాల్లో అటవీ శివారులో కందకాలు తీయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘం మాజీ కార్యదర్శి కే.శ్రీనివాసులు నాయుడు, కొల్లా కోటేశ్వరరావు, రాజేశ్వరనాయుడు, శివయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో అత్యధిక వర్షపాతం

66.4 మి.మీగా నమోదు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 24: బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గడిచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా అనేక చోట్ల వర్షాలు కురిశాయి. అత్యధికంగా శ్రీరంగరాజపురం మండలంలో 66.4 మి.మీ, అత్యల్పంగా బంగారుపాళ్యం మండలంలో 2.6 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా.. గంగాధరనెల్లూరులో 45, నదుంలో 40.2, పులిచెర్లలో 38, తవణంపల్లెలో 34.2, కార్వేటినగరంలో 32.4, వెదురుకుప్పంలో 30.4, విజయపురంలో 30.2, నగరిలో 28.2, పెనుమూరులో 24.8, పూతలపట్టులో 23.6, రొంపిచెర్లలో 21.2, పాలసముద్రంలో 18.4, చిత్తూరు అర్బన్‌లో 18, చిత్తూరు రూరల్‌లో 16.6, సోమలలో 15.4, యాదమరిలో 15, గుడిపాలలో 14.6, ఐరాలలో 8.2, చౌడేపల్లెలో 5.2 మి.మీ వర్షం కురిసింది.

భూ మాయగాడి అరెస్టు



జయచంద్రారెడ్డిని రిమాండుకు తరలిస్తున్న పోలీసులు

వెదురుకుప్పం, సెప్టెంబరు 24: నకిలీ పత్రాలు, ఫోర్జరీ సంతకాలతో భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమాయగాడిని అరెస్టు చేశారు. ఈ విషయాన్ని మంగళవారం సాయంత్రం వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య ధ్రువీకరించారు. వెదురుకుప్పం మండలం జక్కిదొన గ్రామ రెవెన్యూ లెక్కదాఖలాల్లో సర్వే నెంబరు-513/16లో 0.66 విస్తీర్ణం భూమిని నకిలీ, ఫోర్జరీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దీనిపై వెదురుకుప్పం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో వెదురుకుప్పం మండలం గంటావారిపల్లెకు చెందిన నిందితుడైన పుల్లారెడ్డి కుమారుడు ఎస్.జయచంద్రారెడ్డి(28)ని అరెస్టు చేసి, రిమాండుకు తరలించామని మంగళవారం ఎస్ఐ తెలిపారు.

ఎస్సీ బాలికల వసతి గృహంలో జేసీ తనిఖీలు



వసతి గృహంలో రికార్డులు తనిఖీ చేస్తున్న జేసీ విద్యాధరి

బంగారుపాళ్యం, సెప్టెంబరు 24: మండలకేంద్రంలోని బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని జేసీ విద్యాధరి మంగళవారం తనిఖీ చేశారు. పిల్లల హాజరుపట్టికను, నిత్యావసరాల రిజిస్టర్‌ను, మరుగుదొడ్లను, భోజనశాల, వంటగదులను పరిశీలించారు. నెల క్రితం వసతిగృహంలోకి వర్షపునీరు ప్రవేశించడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి.. జేసీ దృష్టికి తెచ్చారు. నూతన భవనాలు ఏర్పాటు చేయాలని విన్నవించారు. తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, డీటీ కళ్యాణి, ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మేము సేవకులమే : చిత్తూరు ఎంపీ, ఎమ్మెల్యే



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

గుడిపాల, సెప్టెంబరు 24: ప్రజలకు సేవ చేయడానికే వచ్చాం తప్ప, జేబులు నింపుకోవడానికి రాలేదని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. మంగళవారం బొమ్మసముద్రం హైస్కూల్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ నాగరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బొమ్మసముద్రం పాఠశాల, కాలేజ్‌కు ఎంపీ, ఎమ్మెల్యే నిధులతో హాలు తదితర నిర్మాణ కార్యక్రమాలను చేపడతామని హామీ ఇచ్చారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, జిల్లా నాయకుడు చంద్రప్రకాష్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడారు. దీపావళికి మహిళలకు ఉచితంగా మూడు సిలిండర్లు పంపిణీ చేసే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, నేతలు బాలాజీ నాయుడు, హేమాద్రి నాయుడు, చంద్రమోహన్, ధనసింగ్, హరి, బోడెబ్బ నాయుడు, దొరబాబు, రమేష్, ఇన్‌చార్జి ఎంపీడీవో ఉపేంద్ర, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, జేఈ మధు, ఏపీఎం సుధారాణి పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి టీడీపీ పెద్దపీట

● ఎమ్మెల్యే మురళీమోహన్



యాదమరి, సెప్టెంబరు 24: ముస్లింల సంక్షేమానికి టీడీపీ పెద్ద పీట వేసిందని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. మంగళవారం 14 కండ్రిగ గ్రామంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ముస్లింల అభివృద్ధికి కృషిచేస్తోందని చెప్పారు. తహసీల్దార్ పార్థసారథి, ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మురార్జీ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ, నాయకులు హేమగిరి, అమర్‌నాథ నాయుడు, ఎన్‌పీ ధరణీప్రకాష్ నాయుడు, కార్జాల అరుణ, మీరా, చిత్రానాయుడు, పత్తిపాటి భగవతి, మునీర్, గోపి గౌడ్, గుణశేఖర్ రాయల్, అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులున్నా హామీల అమలు

● ఎమ్మెల్యే భానుప్రకాష్



నగరి, సెప్టెంబరు 24: రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయి ఉన్నా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం ముందంజలో ఉందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. నగరి మండల పరిధిలోని బుగ్గఅగ్రహారంలో మంగళవారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. వరదల సమయంలోనూ ప్రభుత్వం సకాలంలో సహాయకచర్యలు చేపట్టి బాధితులను ఆదుకుందని చెప్పారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సతీష్, తహసీల్దార్ రవికుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, కార్యదర్శి పురుషోత్తం నాయుడు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు సురేష్‌నాయుడు, తెలుగు మహిళా అధికార ప్రతినిధి మీరా, వేణు, మహేష్, కమల్, మధుయాదవ్, శ్రీనివాసులురెడ్డి, భూపాల్‌రెడ్డి, జవహర్‌రెడ్డి, నారాయణస్వామినాయుడు, ఉమాపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

జీతాలు విడుదల చేయండి

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 24: వైద్య ఆరోగ్య శాఖలో మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులకు జీతాలను విడుదల చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం కోరారు. మంగళవారం విజయవాడలో మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. నాయకులు పురుషోత్తం, రాజేష్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఆశాలపై పనిభారం తగ్గించండి

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 24: ఆశాలపై పనిభారం తగ్గించాలని సీఐటీయూ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం డీఎంహెచ్‌వో ప్రభావతిదేవిని కలిసి వినతిపత్రం సమర్పించారు. యూనియన్ నాయకుడు గంగరాజు మాట్లాడుతూ.. పీహెచ్‌సీల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఫీల్డ్‌కు పోనీయకుండా మూడుసార్లు హాజరు వేయించడం సరికాదన్నారు. సంబంధం లేని పనులను చేయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, రాజకీయ వేధింపులూ మానుకోవాలన్నారు. నాయకులు గంగ, గంగరాజు, ఆశాలు పాల్గొన్నారు.

ఉలవల విత్తన బ్యాగ్‌ల పంపిణీ

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 24: నెల్లేపల్లెలోని రైతు సేవాకేంద్రం వద్ద మంగళవారం రైతులకు సబ్సిడీతో ఉలవల విత్తన బ్యాగ్‌లను అధికారులు, నేతలతో కలిసి జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్ పంపిణీ చేశారు. ఈ కార్యమక్రమంలో మాజీ సర్పంచ్ పుష్పరాజ్, మాజీ ఉప సర్పంచ్ వెంకటపతిరెడ్డి, నేతలు దేవరాజులునాయుడు, వెంకటేష్ యాదవ్, జయరాంరెడ్డి, మునికృష్ణారెడ్డి, తుకారాం రెడ్డి, దామోదర్‌రెడ్డి, త్యాగరాజులురెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ కవిత పాల్గొన్నారు.

రాయితీతో గడ్డి విత్తనాలు

వెదురుకుప్పం: రాయితీతో గడ్డి విత్తనాలను పాడి రైతులకు అందిస్తున్నామని కార్వేటినగరం పశువైద్యాధికారి డాక్టర్ హేమకుమార్ మంగళవారం తెలిపారు. ఆసక్తి ఉన్న పాడి రైతులకు 75 శాతం రాయితీతో ఐదు కిలోల బస్తాను రూ.115కు ఇస్తున్నామని చెప్పారు. అలాగే పశువులకు వ్యాధి నిరోధక టీకాలు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు.

పేదలకు అన్నదానం

గుడిపాల: తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తండ్రి వాసుదేవరెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఆనంద్ యాదవ్, శివలింగా రెడ్డి, కిట్టు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

4నుంచి కోదండరామాలయ దసరా ఉత్సవాలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 24: నగరంలోని కోదండరామాలయంలో అక్టోబరు 4వ తేదీనుంచి దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో సుబ్రహ్మణ్యంనాయుడు, అర్చకుడు వేణుగోపాల్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 4న మత్స్య, 5న కూర్మ, 6న వరాహ, 7న నరసింహ, 8న వామన, 9న పరుశురామ, 10న రామ, 11 బలరామ, 12న కృష్ణావతారాలలో స్వామివారు భక్తులకు దర్శనమిస్తారని వారు పేర్కొన్నారు.

బంగారమ్మకు ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, సెప్టెంబరు 24: కార్వేటినగరం గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహిళా భక్తులు పొంగళ్లు సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త ప్రసాద్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు రంగనాథ మొదలియార్ పర్యవేక్షించారు.

50 గోకులాలు మంజూరు

వెదురుకుప్పం, సెప్టెంబరు 24: కార్వేటినగరం మండలానికి అదనంగా 50 గోకులాలు మంజూరయ్యాయని తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు నగలపాటి నాగేశ్వరరాజు తెలిపారు. మామిడి, చెరకు పంటకు మద్దతు ధర కోసం సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. మామిడి, కూరగాయల పంటల్లో జీవ నియంత్రణ పద్ధతులు పాటించడం వల్ల ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని గణనీయంగా తగ్గించవచ్చునని చెప్పారు.





కాణిపాకంలో జరుగుతున్న ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా ఆస్థాన మండపంలో కళాకారుల నృత్య విన్యాసం, సత్యహరిశ్చంద్ర నాటికలో సన్నివేశం



వరసిద్ధుడికి పట్టువస్త్రాల సమర్పణ

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 24: కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి ప్రత్యేక ఉత్సవాల్లో చంద్రప్రభ వాహన సేవ సందర్భంగా స్వామికి కుటుంబీకులతో కలిసి దేవదాయ శాఖ విశ్రాంత ఏడీసీ జి.కేశవులు.. పట్టువస్త్రాలు సమర్పించారు. ఏటా ఈ సేవ రోజున పట్టు వస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని ఆయన తెలిపారు. అగరంపల్లెలోని తన స్వగృహం నుంచి పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ అధికారులకు అందజేశారు.



← చంద్రప్రభ వాహనం సందర్భంగా నిర్వహించిన కలశ ఊరేగింపులో పాల్గొన్న ఉభయదారులు

వైభవంగా క్షీరాభిషేకం



చంద్రప్రభ వాహన సేవ సందర్భంగా మంగళవారం క్షీరాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శివశంకర్, పోటుగారిభాస్కర్, ఏపీ పరదేశి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ● వరసిద్ధుడిని పల్నానాడు జిల్లా గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస్‌రావు దర్శించుకున్నారు.



క్షీరాభిషేకంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

అధికారులు సరిగా పనిచేయకుంటే ఉపేక్షించం

● ఎంపీ దగ్గుమళ్ల, ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల, సెప్టెంబరు 24: అధికారులు సరిగా పనిచేయకుంటే ఉపేక్షించేది లేదని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. మంగళవారం నాంపల్లెలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన ప్రజావేదిక కార్యక్రమంలో వారు ప్రసంగించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడానికి తాము కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఉపాధి పథకాన్ని రైతుల శ్రేయస్సు కోసం అనుసంధానం చేస్తామన్నారు. వీటితోపాటు ఐరాల మండలం సస్యశ్యామలంగా ఉండటానికి చెరువులకు నీరు వచ్చే కాలువలను పునరుద్ధరిస్తామని తెలిపారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, జిల్లా కార్యదర్శి కోదండయాదవ్, మండల అధ్యక్షుడు గిరిధర్‌బాబు, సర్పంచులు స్వర్ణ, సులోచన, ఉషా, దయానంద, నాయకులు బీఎన్.చౌదరి, ధనంజయనాయుడు, హరిబాబునాయుడు, లత, దేవాజి, చలపతి, రామచంద్రనాయుడు, రాజేష్‌రెడ్డి, పురుషోత్తం, సురేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా 'ఇది మంచి ప్రభుత్వం'

ఎస్‌ఆర్‌పురం, సెప్టెంబరు 24: పెద్ద తయ్యూరు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. టీడీపీ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు పూజారి నాగరాజు తదితరులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు.

గంగాధరనెల్లూరు: తూగుండ్రం పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో జీడీనెల్లూరు టీడీపీ ముస్లిం మైనారిటీ ప్రధానకార్యదర్శి నియాజ్‌అలీ, నేతలు కండిగ శంకర్, ఫెరోజ్, దాసరపల్లె శంకర్, షేర్ అలీ, ఈశ్వరయ్య, కరుణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

విజయపురం: పాతార్కాడు, జంబాడ, కోసలనగరం, ఇళ్లత్తూరు పంచాయతీల్లో జరిగిన కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, మండల ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు సుధాకర్‌రాజు, బాషా, కొండూరు దాము, రవిరాజు, మునిభాస్కర్‌రాజు, నారాయణరాజు, నాగభూషణంయాదవ్, బాలసుబ్రహ్మణ్యం, హరికృష్ణ, వెంకటేష్‌యాదవ్, లోకేష్‌రాజు పాల్గొన్నారు.

పూతలపట్టు: పి.కొత్తకోట, పోలవరం, పంటపల్లె, ఎర్రచెరువుపల్లె, పాటూరు, వేనూతనపల్లె, ఎం.బండపల్లె గ్రామ పంచాయతీల పరిధిలో జరిగిన కార్యక్రమంలో నాయకులు నేతాజి, ఆనంద నాయుడు, మురళి, మంజునాథ్, ఆదికేశవులు, వేణుగోపాల్ నాయుడు, నాగరాజు, మునస్వామి, జయప్రకాష్, మునిరాజులు, పయణి, జయరామ్, రామానుజం, అరుణ్, సురేంద్రనాయుడు, చందు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం మండలంలోని డీఎంపురంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చెంగల్రాయయాదవ్, జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు నగలపాటి నాగేశ్వరరాజు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: నలగాంపల్లె, జంబువారిపల్లె, ముంగరమడుగు, 170 గొల్లపల్లె, గుండ్లకట్టమంచి, మంగళపల్లె తదితర గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎన్‌పీ ధరణీప్రసాద్ నాయుడు, సర్పంచ్ షీబాస్వామి దాస్, ఎంపీటీసీ ప్రసన్నకుమారి, జనార్దన్ గౌడ్, నాగరాజ్ గౌడ్, గిరిబాబు, సూరి నాయుడు, రాధాకృష్ణమ నాయుడు పాల్గొన్నారు.

పెనుమూరు: పెనుమూరు, రామకృష్ణాపురంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యానాయుడు, తలారిరెడ్డెప్ప, గుర్రప్పనాయుడు, గొడుగుమానుపల్లెలో నాదముని, కేసీపల్లెలో అనురాధ, చంద్రబాబు, ఎర్రమట్టిపల్లెలో సురేంద్ర, మఠంపల్లెలో గుణ, పులికల్లులో నరేంద్ర, పూనేపల్లెలో సలాం, పంచాయతీ కార్యదర్శులు ప్రభుకిరణ్, నిర్మలాదేవి, సునీత, జన్మశ్రీ పాల్గొన్నారు.

నింద్ర: అత్తూరు, ఓరూరుపేట, కైపాకం, అరూరు, కొప్పేడు తదితర పంచాయతీల్లో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నాయకులు రవినాయుడు, ఆనందరాజు, రవికుమార్, సురేష్, రవిరాజు, గిరి, లోకేష్, గాలి రమేష్‌నాయుడు, మురళీనాయుడు, పురుషోత్తం నాయుడు, జయప్రకాష్ పాల్గొన్నారు.

దూరదృష్టి కల్గిన నేత చంద్రబాబు: టీడీపీ





పొలంపిలుస్తోంది పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గురజాల - కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 24: దూరదృష్టి కలిగిన నేత ముఖ్యమంత్రి చంద్రబాబు అని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ ప్రశంసించారు. మంగళవారం చిత్తూరు రూరల్ మండలంలోని తాళంబేడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు వారు పండించిన పంటలను వారే విక్రయించే విధంగా 20 ఏళ్ల క్రితమే రైతు బజార్లను ఏర్పాటు చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వం రైతులకు ఎప్పుడూ పెద్దపీట వేస్తుందని చెప్పారు. చిత్తూరు నియోజకవర్గంలో మరో ఆరు రైతు బజార్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం కార్యక్రమ పోస్టర్లను టీడీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. టీడీపీ జిల్లా నాయకులు చంద్రప్రకాష్, జయచంద్రనాయుడు, మండల నాయకులు శశికర్‌బాబు, మోహన్‌రాజ్, రఘు, నీలకంఠం నాయుడు, వెంకటేష్ పాల్గొన్నారు.

మెరుగైన దిగుబడులే లక్ష్యం

నగరి: సాంకేతికత సాయంతో మెరుగైన దిగుబడులు సాధించడానికే రాష్ట్రప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎమ్మెల్యే భానుప్రకాష్ తెలిపారు. నగరి వ్యవసాయ కార్యాలయం వద్ద మంగళవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వ్యవసాయశాఖ ఏడీఏలు సౌభాగ్యలక్ష్మి, రమేష్‌రాజు, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు పురుషోత్తంనాయుడు, టీఎన్‌టీయూసీ బాలాజి, మది, ఆనందరెడ్డి, రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'ని సద్వినియోగం చేసుకోండి

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 24: 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు సూచించారు. మంగళవారం సీకేపురంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయాధికారి నర్మద పాల్గొన్నారు.

పాలసముద్రం: వనదుర్గాపురం, ఎస్‌ఆర్‌ఆర్ కండ్రిగ పంచాయతీల్లో జరిగిన కార్యక్రమంలో ఏవో ఢిల్లీబాబు, పశువైద్య డాక్టరు యశస్విని, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

విజయపురం: విజయపురం దళితవాడ పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో ఏవో రజినీకుమారి, సర్పంచ్‌లు భాస్కర్‌రాజు, మురళీకృష్ణారెడ్డి, మేరీప్రసన్నకుమార్, రైతులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం మండలం సురేంద్రనగరం, డీఎంపురంలో జరిగిన కార్యక్రమంలో ఏవో హేమలత, పశువైద్యాధికారి డాక్టర్ హేమకుమార్, టీడీపీ కార్వేటినగరం మండలాధ్యక్షుడు చెంగల్రాయయాదవ్, జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు నాగేశ్వరరాజు పాల్గొన్నారు. ● వెదురుకుప్పం మండలంలోని మాంబేడు, టీకేఎంపురం గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఏవో సి.వనిత పాల్గొన్నారు.

తవణంపల్లె: తెల్లగుండ్లపల్లెలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి, ఏవో ప్రవీణ్ పాల్గొన్నారు.

పెనుమూరు: పెనుమూరు, రామకృష్ణాపురం పంచాయతీల్లో జరిగిన కార్యక్రమంలో ఏవో సుహర్‌లత, టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్యానాయుడు, తలారిరెడ్డెప్ప, భాస్కర్, దూదివెంకటేష్, హరికృష్ణారెడ్డి, ఏకాంబరం, గుర్రప్పనాయుడు, మునేంద్ర పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: తుంబపాళ్యం, ఈచనేరిపల్లె గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఏవో చిట్టిబాబు, మార్కెటింగ్ శాఖ అధికారి శేఖర్, విస్తరణాధికారి సాదరయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: బసవాపల్లె గ్రామ పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ ప్రభాకర్, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చెన్నకేశవులు, ఏవో మాధవి, మాజీ సర్పంచ్ ఉదయ మధుసూదన్ నాయుడు పాల్గొన్నారు.

నింద్ర: కావనూరు, శ్రీరామపురం పంచాయతీల్లో జరిగిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, ఏవో తులసి, సర్పంచ్‌లు మహేష్, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: అక్కనగారిపల్లెలో జరిగిన కార్యక్రమంలో ఏవో భవాని, వెటర్నరీశాఖ ఏడీ మురళీమోహన్, ఉద్యాన శాఖాధికారి లోకేష్, సిరికల్చర్ ఫీల్డ్‌అసిస్టెంట్ జయచంద్ర, మార్కెటింగ్ యార్డ్ అసిస్టెంట్ రుషేంద్రబాబు, రైతులు పాల్గొన్నారు.

వైసీపీని రాజకీయాలనుంచి బహిష్కరించాలి : టీడీపీ

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 24: వైసీపీని రాజకీయాల నుంచి బహిష్కరించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ పాలనలో జగన్.. రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. ప్రజాసంపదను, సహజ వనరులను విచ్చల విడిగా దోపిడీ చేశారని పేర్కొన్నారు. చివరకు టీటీడీని కూడా తమ అవినీతికి, స్వప్రయోజనాలకు స్థావరంగా వాడుకున్నారన్నారు. నాసిరకం, కల్తీ నెయ్యితో శ్రీవారి లడ్డూలు తయారు చేయించి.. కోట్లాదిమంది భక్తుల మనోభావాలు, విశ్వాసాలను దెబ్బతీసి మహా పాపానికి ఒడిగట్టారని ఆవేదన వెలిబుచ్చారు. ఇంత చేసినా మాజీ సీఎం జగన్, వైసీపీ నేతలు తమ తీరు మార్చుకోకుండా ఎదురుదాడులకు దిగుతున్నారని వివరించారు. అందువల్ల వైసీపీని ప్రజలు.. రాజకీయాలనుంచి బహిష్కరించి, రాష్ట్రాన్ని కాపాడుకోవాలని కోరారు.

టీటీడీ గోశాలలోనూ నాసిరకమైన దాణా, మందులు అందించారు

టీటీడీ గోశాలలోనూ గోమాతలకు నాసిరకమైన దాణా, మందులను గత వైసీపీ పాలనలో అందించారని టీడీపీ నేతలు ఆరోపించారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. చివరకు వైసీపీ నేతలు.. గోమాతల కడుపుకూడా కొట్టారని మండిపడ్డారు. విషయంలో టీటీడీ మాజీ ఈవో జవహర్ రెడ్డి పాత్ర కూడా ఉందని, దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, నేతలు మోహన్‌రాజ్, సురేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథం అలవర్చుకోండి

వెదురుకుప్పం, సెప్టెంబరు 24: విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఎన్‌ఎస్‌ఎస్ పీవో కృష్ణకిషోర్ అన్నారు. మంగళవారం కార్వేటినగరం ఆర్కేఎస్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ పి.స్వరూప అధ్యక్షతన 'జాతీయ సేవా పథకం దినోత్సవం' సమావేశం నిర్వహించారు. ● ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయులురెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం ఆచారి, ఎన్‌ఎస్‌ఎస్ పీవో డాక్టర్ ధనంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ● వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అన్నపూర్ణశారద, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటరు డాక్టర్ సి.మంగళగౌరి, విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్తూరు (సెంట్రల్): ఎన్‌పీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి షమ్స్ అక్తర్, విద్యార్థినులు పాల్గొన్నారు.

పాలసముద్రం: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని ముళ్లకంపలు, పిచ్చిమొక్కలను ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు తొలగించారు. ప్రిన్సిపాల్ హేమలత, అధ్యాపకులు వినాయకం, సూర్యన్, సుశీల, రమ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



విజయపురం, సెప్టెంబరు 24: బొగ్గలవారి కండ్రిగ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య మంగళవారం పెన్నులు, పెన్సిల్, నోటుపుస్తకాలు వితరణ చేశారు. హెచ్‌ఎం సబిదాబేగం, రిటైర్డు ఉపాధ్యాయుడు దొరస్వామి, అంగన్వాడీ కార్యకర్త విజయ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల షెడ్‌ను తనిఖీ చేసిన కమిషనర్

చిత్తూరు, సెప్టెంబరు 24: నగరపాలకసంస్థ వాహనాల షెడ్డును కమిషనర్ నరసింహ ప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. ఎన్ని వాహనాలకు మరమ్మతులకు గురయ్యాయో తెలుసుకున్నారు. మస్టర్ పాయింట్‌నూ పరిశీలించారు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింహ, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈగా సతీష్‌కుమార్



వెదురుకుప్పం, సెప్టెంబరు 24: కార్వేటినగరం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈగా ఎంఆర్ సతీష్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలన్నారు.

కట్టమంచి చెరువు సుందరీకరణకు చర్యలు

చిత్తూరు, సెప్టెంబరు 24: నగరంలోని కట్టమంచి చెరువును మంగళవారం ఎమ్మెల్యే దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండు వెనుకవైపు బలహీనంగా ఉన్న చెరువు కట్ట ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి, చెరువు సుందరీకరణపై చర్చించారు. పూడిక తీసి చెరువు కట్టను బలోపేతం చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. సుందరీకరణ పనులపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. అలాగే నగరంలోని ముఖ్యమైన ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. మేయర్ అముద, ఇరిగేషన్ ఎస్‌ఈ విజయకుమార్‌రెడ్డి, కమిషనర్ నరసింహ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు పాల్గొన్నారు.

బస్ డ్రైవర్ ఆత్మహత్య



చలపతి (ఫైల్ ఫొటో)

బంగారుపాళ్యం, సెప్టెంబరు 24: కుటుంబ కలహాలతో ఓ బస్ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాలేరు గ్రామానికి చెందిన వెంకటేశులు కుమారుడు చలపతి (33) ఓ ప్రైవేట్ స్కూల్‌లో బస్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. కుటుంబ కలహాలతో సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు.

శ్మశాన స్థలం కోసం సర్వే



తవణంపల్లె, సెప్టెంబరు 24: శ్మశాన స్థలం కేటాయించాలని మండలంలోని కట్టకిందపల్లె పంచాయతీ విజయనగరం కాలనీ ఎస్టీలు గతంలో కలెక్టరుకు వినతిపత్రం ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం రెవెన్యూ అధికారులొచ్చి శ్మశాన స్థలం కోసం సర్వే చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి సురేంద్రనాథ్ మాట్లాడుతూ.. ఎస్టీలు సరైన శ్మశాన లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆదివాసి జిల్లా కార్యదర్శి సుగుణ, దొరస్వామి, భాస్కర్, ఎస్టీలు పాల్గొన్నారు.

గుడిపాలలో పబ్లిక్ టాయిలెట్ ఏర్పాటు చేయండి

గుడిపాల, సెప్టెంబరు 23: గుడిపాలలో పబ్లిక్ టాయ్‌లెట్‌ను ఏర్పాటు చేయాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావును సావర్కర్ ట్రస్టు చైర్మన్ దేవరాజన్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపీని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. మండల యువజన అధ్యక్షుడు మధు, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు శివ పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం



గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 24: రోడ్డు ప్రమాదంలో భర్తను, బిడ్డను పోగొట్టుకున్న బాలగంగనపల్లె గ్రామానికి చెందిన హసీమాకు మంగళవారం కుప్పనపల్లెకు చెందిన టీడీపీ యువనేత, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ యువరాజారెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. మంగళవారం రూ.30వేలను బాధితురాలికి అందజేశారు. సీఎం చంద్రబాబు స్ఫూర్తితో ఎమ్మెల్యే థామస్ సూచనలతో ఈ సాయం చేశానన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు దుస్తుల పంపిణీ



నింద్ర, సెప్టెంబరు 24: శ్రీరామ పంచాయితీలో పనిచేసే గ్రీన్ అంబాసిడర్లకు సర్పంచ్ జయమ్మ దుస్తులను ఉచితంగా పంపిణీ చేశారు. మంగళవారం శ్రీరామపురంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వెంకటేశులు, కార్యదర్శి భరణి, ఎంపీవో అరుణాచలం, నాయకులు బాలకృష్ణ, కాటయ్య, అప్పారావు, మనోహర్‌నాయుడు, మనోజ్‌యాదవ్, నాదముని స్వామి, డిల్లీ నాయుడు, అభిషేక్, ప్రసాద్, రాకేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.